# ఆర్యాణి

శ్రీ నాయుడు వెంకట సీతారామమూర్తి

భారతావనిలో తురుష్కుల పాలన నాటి కాలమది. మతోన్మాదులైన మహమ్మదీయులు హైందవజాతిని ఛిన్న భిన్నం చేసి, హిందూమతాన్ని సర్వనాశనం చేసిన రోజులవి. పవిత్రమైన ఆలయాల్ని పడగొట్టి వాటిపై మశీదుల్ని నిర్మించే ఘడియలవి.

ఆ నాడు హిందువులందరూ మహమ్మదీయుల చేతిలో కీలుబొమ్మలు. జాతిలోని అంతఃకలహాలు, కుట్రలు, ఫలితంగా, వారి సామ్రాజ్యాల్ని కైవసం చేసుకొని హిందూ మత ప్రభోధకుల్ని ఉరితీయించేరు. మత గ్రంథాలన్నిటినీ మట్టిపాలు చేశారు. భారతీయ సంస్కృతీ సాంప్రదాయాల్ని సర్వనాశనం చేశారు.

ఆనాటి మహమ్మదీయ మహాసామ్రాజ్యాన్ని సుల్తాను ప్రభువు పాలిస్తున్నాడు. సుల్తాను అత్యంత కాఠిన్య హృదయుడు. కామాంధుడు. స్త్రీవ్యామోహం ఎక్కువ. జీవితంలో యౌవనం తప్ప మరేదీ ఉండరాదనే మనస్తత్వం ఈతనిది. రాజ్యభారాన్ని మంత్రిచేతిలో పెట్టేడు. ఈతనికి కావలశింది ఒక్క స్త్రీ.

దర్బారులో పరిచర్యలు చేసేవారందరూ స్త్రీలే. మత్తేకమైన విందులు, వినోదాలు, నగ్న స్వరూపంలో కామోద్రేకప్రేరితమైన నాట్యాలూ ఈతనికి మక్కువ.

దేశంలో ఉన్న అందమైన యువతుల కోసంగూడ చారులను పంపించేవాడు. ఎట్టి పరిస్థితుల్లోనైనా, ఎక్కడ ఉన్నా దౌర్జన్యంగా అపహరించవలసిందే!

ఈతని హృదయంలో దయ, దాక్షిణ్యం, ప్రేమ, అనురాగం, అనేవి లేవు. స్త్రీలే ఈతనికి విలాసవస్తువులు. యౌవనవతి, రూపవతి, అయిన అప్సర కౌగిట్లో ఎల్లప్పుడూ ఉండవలశిందే. నిండు యవ్వనంతో నవనవలాడుతున్న .... యువతి ఎల్లప్పుడూ ఈతని సేద దీర్చడానికి వింజామరలు వీచవలశిందే.

విదేశాలనుంచి బానిసలుగా తీసుకురాబడి డబ్బుకోసం విక్రయించబడిన అందమైన అప్సరసలు అంతఃపురంలో అనేకులున్నారు. వీరు తమ తమ చాకచక్యంతో సుల్తానును మెప్పించి, కాముకచర్యలతో ఉద్రిక్త పరచడమే వీరి నిత్యకర్తవ్యం. ఎక్కువగా ఆకర్షింపబడే "ఆశిక్ని"లకు బహుమతులు కూడా యివ్వబడేవి.

వీరుగాక మతానుసారంగా పరిణయమాడిన మగువలుకూడా ఉన్నారు. వీరిని కూడా వేళ్లమీద లెక్కపెట్ట శక్యంకాదు. వివాహమాడిన మొదటిరాత్రే ఆమెను అనుభవిస్తాడు. తరువాత ఆమెకు ప్రత్యేకమైన భవంతిలో నివాసం. చుట్టూ సైనికులు కాపలా. ఏకాంతంగా, ఒంటరిగా, ఖైదీగా ఆయువతి జీవితాంతం గడపవలశిందే ఈ నియమాన్ని అతిక్రమించిన వారికి ఒకటే శిక్ష. — ఉరిశిక్ష.

కల్యాణి కళింగ రాజ పుత్రి
నిండు జవ్వని.
అపురూపసుందరి.
సౌశీల్య

తగిన వరునికోసం స్వయంవరంచాటిం చేడు కళింగరాజు. వివిధ దేశాలనుంచి, మేధావులందరూ విచ్చేశారు స్వయంవరానికి. రాకుమారి పూలదండ చేత బూని మేలి ముసుగు నుంచి క్రీగంటి చూపుతో రాకుమారుల ముఖారవిందాల్ని తిలకిస్తున్నది. పొంగి పొరలివచ్చే ముసి ముసి నవ్వుల్ని ఆపుకుంటూ, నెమ్మదిగా నడక సాగిస్తూ రాజపుత్రులను పరీక్షిస్తున్నది.

ఇంతలో కోట వెలుపల కోలాహలం- సుల్తాన్ సైనికులు కళింగరాజ్యంపై విరుచుకుపడ్డారు. కళింగ రాజును కడ తేర్చి కోటను వశపర్చుకున్నారు. రాకుమారి సుల్తాన్ చేతికిచిక్కింది. స్పృహతప్పి ఉన్న రాకుమారి మెడలో మంగళసూత్రాన్ని కట్టి తన దేశానికి తీసుకుపోయాడు సుల్తాను ప్రభువు.

కల్యాణికి తెలివి వచ్చింది. కళ్లు తెర చింది. మెడలోని మంగళసూత్రాన్ని చూసి ఆశ్చర్యపోయింది.

''భయపడకురాణీ? '' బొంగురుకంఠం కల్యాణికి దగ్గరగా చేరింది. -

''ఎవరు నువ్వు?'' కల్యాణి ప్రశ్నించింది.

''నీ భర్తను''

రాకుమారి నివ్వెర పోయింది.

''అవును రాణీ? మీమతానికి వ్యతిరేకుణ్ణయినా నీకోసం మీ మతానుసారంగానే నిన్ను పరిణయమాడేను. హిందూ మతంలో రాక్షసవివాహాలు అనాదినుంచీ వస్తున్న ఆచారమే. నేనూ నిన్ను ఆపద్ధతినే చేరదీసుకు వచ్చేను''

''బంధించి తీసుకువచ్చేరా? ''

''సౌందర్యరాశివి గనక నా హృదయానికి రాణిగా చేసుకున్నాను. నిన్ను ఎంతో గౌరవిస్తున్నాను. ప్రేమిస్తున్నాను నన్ను కనికరించు, తృణీకరించకు ''ఎక్కడ ఏరకం నాటకం ఆడాలో సుల్తాను ప్రభువుకి పూర్తిగా తెలుసు.

''ప్రేమకు కలిమిలేములు, మతభేదాలు, అంతరాయంకాజాలవు. యిందుకు మీ తండ్రి వ్యతిరేకించినందువల్లనే దండయాత్ర చేయాల్సివచ్చింది. నిన్ను మన సారాప్రేమించేను. నన్ను ప్రేమించు'' ఈ రకం పాఠం చాలామందికి అప్పజెప్పేడు సుల్తాను ప్రభువు.

కల్యాణి మారు మాటాడలేకపోయింది. తనకు వివాహం జరిగిన మాట వాస్తవం. అది ఏ విధంగా జరిగినా, ఎలా జరిగినా, పవిత్రమైన మంగళసూత్రం తనమెడలో బంధింపబడింది. కల్యాణి హృదయం కరిగింది. సుల్తాను ప్రభువు తనహృదయానికే ప్రభువు.

భర్తకు నమస్కరించింది కల్యాణి. ఆనాటి రాత్రి ఆనందంగా గడచిపోయింది. మరునాటినుండి కథ మామూలే.

సుల్తాను ప్రభువు కల్యాణి కంటికే దూరమయ్యేడు. కల్యాణిని ఓ ప్రత్యేకమైన భవనంలో పంజరంలోచిలుకవలె నివాసం ఏర్పాటు చేశారు. రోజులు - వారాలు - నెలలు గడుస్తున్నాయి.

కల్యాణి ఎంతగానో భర్తకోసం పరితపించింది. కనీసం పరిచారిక చేతనైనా కబురు చేయ్యలేని దీనావస్థలో మునిగి తేలుతున్నది.

ఒక నాటి నిశిరాత్రి సమయంలో – కల్యాణి గాఢంగా నిద్రపోతున్నది. ప్రక్క మేడలోనికి ఓ ముసుగు వ్యక్తి నెమ్మదిగా ప్రవేశించాడు. ఒక ఆడగొంతుకు, ఒక మగగొంతుకు, గుసగుసలాడుకుంటున్నాయి.

ఇంతట్లో బయటనుండి సైనికుల కేకలు వినిపించేయి. కల్యాణి ఉలిక్కిపడి లేచింది. బయటికి వచ్చి చూశింది. ఎవరో ముసుగు వ్యక్తి పారిపోతున్నాడు ప్రక్క మేడలోనుంచి ఆశ్చర్యం! ఆ ముసుగు వ్యక్తి కల్యాణి భవంతి మీదికే దూకేడు.

సైనికులు మేడను చుట్టుముట్టేరు. ముసుగు మనిషి పారిపోడానికి ప్రయత్నిస్తున్నాడు. కానీ సైనికులు సూలంతో ఆతనిని హతమార్చేరు. కల్యాణిని కూడా బంధించేరు –

మరునాడు ఉదయం –

"ఎవరా ముసుగుమనిషి ?

సుల్తాను ఉగ్రుడయ్యాడు.

"నాకు తెలయదు ప్రభూ ?"

అమాయకంగా కల్యాణి సమాధానమిచ్చింది.

"ఛీ! నీచురాలా ! నన్నే మోసం చేస్తావా ?"

"నేను నిర్దోషిని ప్రభూ !"

"పవిత్రమైన హిందూ మతంలో పుట్టేనన్నావు. భర్తనే దైవంగా పూజించుకుంటున్నానన్నావు. అన్ని నీతులు చెప్పిన దానివి అవినీతికి పాల్పడతావా !"

"నన్ను నమ్మండి. నిద్రపోతున్న దాన్ని సైనికుల కోలాహలంవిని లేచేను. ప్రక్కగా ఉన్న మేడపైనుంచి ఆ ముసుగువ్యక్తి నా మేడపైకి ఉరికేడు. పారిపోతుంటే వాణ్ణి సైనికులే హతమార్చేరు. నన్ను బంధించి తీసుకువచ్చేరు"

"అంతా కల్పన. హైందవ స్త్రీనన్నావు. పాతివ్రత్యమే పరమావిధన్నావు. వేరొకనితో వ్యభిచారమా ?"

"అన్యాయంగా నాపై ఈ కళంకాన్ని ఆపాదించకండి స్వామి ? నేను దోషిని కాదు"

"రుజువు?"

"భగవంతుడే సాక్షి"

"ఈ నేరానికి శిక్షేమిటో తెలుసా ?"

"ఉరిశిక్ష"

"అందుకు సిద్ధపడే చేశావన్నమాట"

"నేను సర్వదా మిమ్మల్నే దైవంగా పూజించుకుంటున్నాన్న. మీరే శిక్ష విధించినా సంతోషంగా స్వీకరిస్తాను. కానీ నాపై ఎట్టి కళంకాన్నీ రానివ్వకండి"

"నామీద అయిష్టత అనేది నీకుంటే ఆనాడే ఏ ఆత్మహత్యకైనా పాల్పడిఉందువు. అయినా నేరం సిమీద మోపబడింది. సాక్షులు, రుజువులు, నీకు వ్యతిరేకంగా ఉన్నాయి. నిన్ను నడివీధిలో నలుగురు ఎదుటా ఉరికంబానికి ఎక్కించడం నా అభిమతంకాదు. నేను నీ భర్తను. నా ఆజ్ఞను శిరసావహించే సతివే అయితే, నీ నిర్దోషిత్వాన్ని రుజువు పరచేటందుకు ఈ విషాన్ని త్రాగు" గ్లాసును చేతికి అందిచ్చేడు ఆ కర్కశ హృదయుడు.

గడగడా త్రాగింది రాజపుత్రి.

సుల్తాను నిర్భ్రాంత పోయాడు.